మల్లేపల్లిలో రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ పానీగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన రెజ్లింగ్ పోటీలను శనివారం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. – మెహిదీపట్నం డిసెంబర్ 23

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి

మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు వర్ధంతి సందర్భంగా నెక్లెస్ రోడ్ లోని పీవీ ఘాట్ వద్ద శనివారం బీఆర్ఎస్‌వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి రాజ్‌కుమార్, వెంకటేశ్, ప్రశాంత్, సాగర్, మహేశ్, సురేశ్ తదితరులు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. –సుల్తాన్‌బజార్, డిసెంబర్ 23

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 23 : పాఠశాల స్థాయిలో పదో తరగతి అనేది విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలిపే మొదటి మెట్టు.. అని ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే అన్నారు. శనివారం ఆయిస్టర్ సంస్థ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివాల్యుయేషన్ సంయుక్తాధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సునీల్‌సింగాడే పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ చేసి పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయిస్టర్ ప్రతినిధులు రజిత, కిరణ్, సీజీఆర్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, బాలచైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

- వైష్ణవ ఆలయాల్లో పోటెత్తిన భక్తజనం
- పలుచోట్ల ఉత్తర ద్వార దర్శనం

చార్మినార్/సుల్తాన్‌బజార్/మెహిదీపట్నం/చాంద్రాయణగుట్ట/ కార్వాన్/ జియాగూడ/ఆబిడ్స్, డిసెంబర్ 23: వైకుంఠ(ముక్కోటి) ఏకాదశిని పురస్కరించుకుని గోషామహల్, కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల పరిధిలోని పలు ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతనగరంలోని వైష్ణవ దేవాలయాలు తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. గౌలిపుర కోదండరామస్వామి ఆలయం, సర్దార్ మహల్ సమీపంలోని చౌక్ మైదాన్ వేంకటేశ్వరస్వామి, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలోనూ కదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండరామస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించిన నిర్వాహకులు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు దక్షిణ మండల డీసీపీ సాయిచైతన్య తదితరులు భాగ్యలక్ష్మి అమ్మవారు,వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

జియాగూడ రంగనాథస్వామి దేవస్థానంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీమహావిష్ణువు

సుల్తాన్‌బజార్,విజయనగర్ కాలనీ పరిధిలో..

వైకుంఠ ఏకాదశికి సుల్తాన్‌బజార్, విజయనగర్ కాలనీల పరిధిలోని దేవాలయాలు ముస్తాబయ్యాయి. వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకునేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాంకోఠి లోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం, దేవునికుంట వేంకటేశ్వరస్వామి, విజయనగర్ కాలనీ హనుమాన్ దేవాలయాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. రాంకోఠి లోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో మహేశ్ బ్యాంక్ చైర్మన్ రమేశ్‌కుమార్ బంగ్, ఆలయ ట్రస్టీలు ప్రత్యేక పూజలు చేశారు.

మెహిదీపట్నంలో..

వైకుంఠ ఏకాదశిని కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలలో శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. లంగర్‌హౌస్,నానల్‌నగర్,గుడిమల్కాపూర్ ప్రాంతాల్లోని వేంకటేశ్వరస్వామి, రామాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయడంతో భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చి పూజలు చేశారు. లంగర్‌హౌస్ సంగం రామాలయంలో బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి ఠాకూర్‌జీవన్‌సింగ్ పూజలు చేశారు. మెహిదీపట్నం దేవునికుంట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఎంఎస్ ఉషాప్రభాకర్‌రావు తదితరులు పూజలు చేశారు.

దేవునికుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఎంఎస్ ఉషాప్రభాకర్‌రావు

చాంద్రాయణగుట్ట పరిధిలో..

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం పాతబస్తీలోని పలు ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారలను ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. రక్షాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం, ఉమామ హేశ్వరస్వామి, లాల్‌దర్వాజ వేంకటేశ్వరస్వామి, గౌలిపుర కోదండ రామస్వామి, చాంద్రాయణగుట్ట లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

రక్షాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వాన్ పరిధిలో..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం కార్వాన్,గుడిమల్కాపూర్ డివిజన్లలోని ఆలయాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గుడిమల్కాపూర్‌లోని చారిత్రాత్మక జాంసింగ్ వేంకటేశ్వరస్వామి ఆలయం, రాంసింగ్‌పురాలోని బాలాజీ ఆలయం, తాళ్లగడ్డలోని రాధాక్రిష్ణ ఆలయం, విశ్వేశ్వర్‌నగర్‌లోని భద్రాద్రి సీతారామాలయంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు.

జియాగూడ రంగనాథ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

జియాగూడలోని చారిత్రాత్మకమైన రంగనాథ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించి పూజలు ప్రారంభించారు. ఆలయ పూజారులు శేషాచార్యులు, తిరువెంగళాచార్యులు, బద్రి భక్తులకు ప్రసాదాలను అందజేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు మిత్ర కృష్ణ, బంగారి ప్రకాశ్, రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు అరుణ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్ రెడ్డి, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

దాయ్‌బాగ్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

తబ్లిగీ జమాతే సమావేశాలకు అనుమతిని రద్దు చేయాలని డీజీపీకి వినతి

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 23: తబ్లిగి జమాతే సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడాన్ని విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండించింది. జనవరి 6,7,8 తేదీల్లో ఉగ్రవాద ప్రేరేపిత సంస్థ తబ్లిగి జమాతే నిర్వహిస్తున్న సమావేశాలకు అనుమతిని రద్దు చేయాలని శనివారం వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, సహ కార్యదర్శులు రాజేశ్వర్‌రెడ్డి, భానుప్రసాద్, ప్రచార ప్రముఖ్ బాలస్వామి, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, తిరుపతినాయక్ లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ రవిగుప్తాకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ నిధులను వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మిలటరీ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మెహిదీపట్నం డిసెంబర్ 23 : గుడిమల్కాపూర్‌లో నివసించే నాగులు శనివారం లంగర్‌హౌస్ రింగ్‌రోడ్ ప్రాంతంలో మిలటరీ మద్యం తరలిస్తుండగా స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 53 మద్యం బాటిళ్లు, యాక్టివా స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గోల్కొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శారద తెలిపారు.

పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకోండి..

ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే పూర్తి చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్‌ను ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరారు. – ఆబిడ్స్ డిసెంబర్ 23

రోడ్డు ప్రమాద మృతులకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

రవీంద్రభారతి, డిసెంబర్ 23: వేములవాడ రాజరాజేశ్వరిస్వామి దర్శనానికి వెళుతూ హన్మకొండ జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఏటూరునాగారానికి చెందిన విశ్వబ్రాహ్మణులు నలుగురు మృతిచెందడం దురదృష్టకరమని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం నేతలు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మమాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీ. మదన్మోహన్, గౌరవాధ్యక్షుడు వెంకటాచారి, కృష్ణమాచార్యులు శనివారం బషీర్‌బాగ్‌లో మీడియాతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతి తరపున సంతాపం తెలుపుతున్నామన్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం మృతుల కుటుంబ సభ్యులకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసదుపాయాలు అందించాలని కోరారు. వారి వెంట సంఘం నేతలు రాగిఫణి రవీంద్రాచారి, తదితరులు ఉన్నారు.